



ఐదేళ్లుగా నరకం చూపిస్తున్న శ్రీకాకుళం-ఆమదాలవలస గుంతల రహదారి

'ఆమదాలవలస చక్కెర కర్మాగారాన్ని తెరిపించడం సాధ్యం కాదని చంద్రబాబు అంటున్నారు. నేను అధికారంలోకి వస్తే నెలరోజుల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తాను. రైతులు, కార్మికుల బతుకుల్లో వెలుగులు నింపుతాను'.

- ఇదీ 2019లో ఆమదాలవలసలో పాదయాత్ర సందర్భంగా సీఎం జగన్ హామీ.





ఆమదాలవలసలో మూతపడిన చక్కెర కర్మాగారం

గుంతల రహదారిలో ప్రమాదాలెన్నో..

శ్రీకాకుళం-ఆమదాలవలస రహదారి గుంతలమయంగా మారి.. నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారు. అయినా అటు మంత్రి ధర్మాన ప్రసాదరావు కానీ, ఇటు స్పీకర్ తమ్మినేని సీతారాం కానీ ఈ సమస్య పరిష్కారంపై దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. టీడీపీ హయాంలో ఈ రహదారి అభివృద్ధికి రూ.40కోట్లు మంజూరు చేయగా 25 శాతం పనులు చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు నిలిచిపోయాయి.

జగనన్నా.. తీపి హామీ ఏమైంది?

- తెరచుకోని చక్కెర కర్మాగారం
- నేతల మాటలు.. ప్రకటనలకే పరిమితం
- సమస్యల వలయంలో ఆమదాలవలస

వాస్తవ పరిస్థితి పరిశీలిస్తే.. హామీ ఇచ్చి ఐదేళ్లు గడిచిపోయింది. వైసీపీ పాలనలో కనీసం చక్కెర కర్మాగారం ప్రస్తావన లేదు. స్వయాన సీఎం జగన్ ఇచ్చిన హామీ కూడా ప్రకటనకే పరిమితిమైందని రైతులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఆమదాలవలస)

జిల్లాలో రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు పొందిన ఆమదాలవలస నియోజకవర్గం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతుంది. ఐదేళ్లకోసారి ఎన్నికల వేళ నేతల హామీలు ప్రకటనలకే పరిమితమవుతున్నాయి. ప్రధానంగా దశాబ్దాల చరిత్ర కలిగిన చక్కెర కర్మాగారం మూతపడడంతో రైతులకు, కార్మికులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. 2019లో ఆమదాలవలసలో పాదయాత్ర చేపట్టిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి.. తాము అధికారంలోకి వచ్చిన నెలరోజుల్లో చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తామని హామీ ఇచ్చారు. కానీ, నేటికీ నీటమూటగానే మిగిలింది. తీపికబురు లాంటి ఆ హామీ చేదు జ్ఞాపకంగానే మిగిలిపోయిందని రైతులు, కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆమదాలవలసలో 1961లో బొడ్డేపల్లి రాజగోపాలరావు హయాంలో చక్కెర కర్మాగారాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 74 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ కర్మాగారంలో 1962-63లో ఉత్పత్తి ప్రారంభించారు. చెరకు రైతులతోపాటు సుమారు 700 మంది ఉద్యోగులు, కార్మికులకు ఉపాధి కల్పించారు. ఊహించని నష్టాల కారణంగా 2004లో కర్మా గారం మూతపడింది. అదే ఏడాది బెంగళూరులో ఓ ప్రైవేటు సంస్థకు కర్మాగారాన్ని విక్రయించారు. కొందరు షేర్ హోల్డర్లు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కర్మాగారాన్ని సహకార సంఘాలు నడిపించాలని కోర్టు తీర్పు ఇచ్చింది. ప్రభుత్వ ఆదేశాలతో 2021 ఆగస్టులో అప్పటి కలెక్టర్ కర్మాగారంపై నివేదిక కూడా ప్రభుత్వానికి అందించారు. అయినా వైసీపీ ప్రభుత్వం మౌనం వహించి.. జగన్ పాదయాత్ర హామీని తుంగలో తొక్కా రని రైతులు వాపోతున్నారు. కర్మాగారం పునఃప్రారంభిస్తే ఆమదాల వలస, బూర్జ, పొందూరు, సంతకవిటి, సరు బుజ్జిలి, ఎల్ఎన్‌పేట, హిరమండలం, నరసన్నపేట, జలు మూరు, శ్రీకాకుళం, లావేరు, రణస్థలం, ఎచ్చెర్ల, పాతపట్నం ఇలా 15 మండలాల రైతులకు మేలు జరుగుతుందని అభి ప్రాయపడుతున్నారు.



చింతాడలో నీటికోసం మహిళల పాట్లు

అంతటా.. సమస్యలే..

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని ఏవార్డులో చూసినా సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. 23వార్డుల్లోనూ తాగునీటి సమస్య నెలకొంది. సప్తపురాలు, చింతాడ, తిమ్మాపురం, పార్వతీశంపేట, జగ్గుశాస్త్రులపేటలో కేవలం మూడు ట్యాంకర్లతో మూడు రోజులకు ఒకసారి తాగునీరు సరఫరా చేయడంతో మహిళల కష్టాలు వర్ణణాతీతం. అలాగే 20వార్డు వెంగళరావు కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేక స్థానికులు ఏర్పాటు చేసుకున్న చిన్నపాటి కాలువల ద్వారా మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో నిత్యం దుర్వాసన, దోమల బెడద భరించలేకపోతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రైతులకు కూడా సాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. 2017లో అప్పటి సీఎం చంద్రబాబు.. వంశధార, నాగావళి నదుల అను సంధానంతో జిల్లాలో సుమారు 60వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిధులు మంజూరు చేశా రు. ఈ మేరకు 70శాతం పనులు పూర్తయ్యాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నదుల అనుసంధానం పనులు నిలిచిపోయాయి.

- సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో వెన్నెలవలస, బొమ్మిక జలాశయాల ద్వారా గతంలో సుమారు 900 ఎకరాలకు సాగునీరు అందించేవారు. వైసీపీ పాలనలో జలా శయాల నిర్వహణ, అభివృద్ధికి నిధులు మంజూరు చేయలేదు. దీంతో మదుమలు, కాలువలు మూసుకు పోయాయి. రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో వంశధార నది నుంచి కుడి ప్రధాన కాలువ ఏర్పాటు చేసి ఐదు మండలాలకు సాగునీరు అందించేలా చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆమదాలవలస రైల్వేట్రాక్ క్రాసింగ్ నుంచి గేదెలవానిపేట వరకు సాగునీరు ప్రవహించడానికి వయోడెక్ట్ ఏర్పాటు చేశారు. దీనిని ప్రారంభించిన కొద్దినెలల తర్వాత లీకులు ఏర్పడింది. దీంతో ఈ రోడ్డులో రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



అభివృద్ధికి నోచుకోని వెన్నెలవలస జలాశయం

మినీ స్టేడియం అభివృద్ధి ఏదీ..

జగ్గుశాస్త్రులపేట వద్ద మినీ స్టేడియాన్ని టీడీపీ హయాంలో చంద్రబాబు వర్చువల్‌గా ప్రారంభించారు. జిల్లా క్రికెట్ సంఘ ఆధ్వర్యంలో పోటీల నిర్వహణకుగానూ ఈ స్టేడియాన్ని భారీస్థాయిలో నిర్మిస్తామని వైసీపీ పాలకులు హామీ ఇచ్చారు. ఈ మేరకు నిర్మాణాలు తొలగించినా.. ఇప్పటివరకూ పనులు చేపట్టలేదని క్రీడాకారులు ఆరోపిస్తున్నారు.

రాజకీయ లబ్ధికే..



పాదయాత్ర సమయంలో జగన్మోహన్‌రెడ్డి ఆమదాలవలస చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తారని హామీనిచ్చి.. ఇప్పుడు మరిచిపోయారు. నేటికి ఐదేళ్లు కావస్తున్నా ఆ ఊసే లేదు. కేవలం రాజకీయ లబ్ధికోసం హామీనిచ్చారు. ఈ ఎన్నికల్లో వైసీపీకి రైతులు బుద్ధి చెబుతారు.

-ఎండ అప్పలనాయుడు, రైతు, వంజంగి


రైతులను మోసం చేశారు..



2019 ఎన్నికల్లో రైతులకు హామీనిచ్చి వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. వైసీపీకి ఈ ఎన్నికల్లో రైతుల ఉసురు తగలడం ఖాయం.

-కొంగరాపు మల్లేశ్వరరావు, రైతు, సుభద్రాపురం, సరుబుజ్జిలి

ఆశ నిరాశే..



చక్కెర కర్మాగారంలో 1962 సంవత్సరం నుంచి.. ఫ్యాక్టరీ అమ్మేసిన వరకు అకౌంట్ సెక్షన్‌లో విధులు నిర్వహించేవాడిని. రాజకీయ నాయకులు హామీలు ఇచ్చేటప్పుడు కర్మాగారం మళ్లీ తెరుచుకుంటుందని ఆశ పడతాం. కానీ హామీలు నెరవేరకపోవడంతో నిరాశే మిగులుతోంది.

-మెట్ట కొండయ్య, ఆమదాలవలస

జీవనోపాధి కరువైంది..



కర్మాగారంలో దినసరి వేతనంతో మెకానిక్‌గా విధులు నిర్వహించేవాడిని. మూతపడడంతో జీవనోపాధి లేక.. కర్మాగారం తెరుస్తారని ఎదురుచూపులే మిగిలాయి.

-బగాన అమ్మినాయుడు, ఆమదాలవలస



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

జూన్ 29న జాతీయ లోక్‌అదాలత్

గుజరాతీపేట, ఏప్రిల్ 26: జాతీయ లోక్ అదాలత్ జూన్ 29న నిర్వహిస్తామని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా తెలిపారు. శుక్రవారం శ్రీకాకుళంలోని కోర్టు ఆవరణలో.. పోలీసులు, ఇన్సూరెన్స్, న్యాయాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రధాన కోర్టు సముదాయంతోపాటు ఆమదావలస, ఇచ్ఛాపురం, పాలకొండ, పలాస, పాతపట్నం, రాజాం, సోంపేట, టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట, కొత్తూరు, పొందూరు కోర్టుల్లో.. జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. బాధితులకు సత్వర న్యాయం చూపేలా.. ఎక్కువ కేసులు రాజీకి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ఏఎస్పీ, డీఎస్పీలు, పోలీసు అధికారులు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు, పీపీలు నాగభూషణరావు, సుశీల, తంగి శివప్రసాద్, వాన కృష్ణచంద్ పాల్గొన్నారు.

నేడు పాలిసెట్

ఎచ్చెర్ల, ఏప్రిల్ 26: పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి శనివారం పాలిసెట్ నిర్వహించనున్నట్టు సమన్వయ కర్తలు గురుగుబెల్లి దామోదరరావు, ఎ.గోపి తెలిపారు. 'జిల్లాలో 42 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తాం. శ్రీకాకుళం డివిజన్ పరిధిలో 26 కేంద్రాల్లో 7,178 మంది, టెక్కలి డివిజన్ పరిధిలో 16 కేంద్రాల్లో 4,756 మంది.. మొత్తంగా 11,934 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్ష ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు జరుగుతుంది. విద్యార్థులు గంట ముందు పరీక్షా కేంద్రాలకు హాజరు కావాల'ని వారు సూచించారు.

మమ్మల్నే ఎదిరిస్తార్రా?

- కూటమి సానుభూతిపరులపై వైసీపీ నేతల దాష్టీకం
- మత్స్యకార గ్రామాల్లో దాడులకు తెగబడుతున్న వైనం
- పొరుగు గ్రామాలకు వెళ్లిపోతున్న బాధితులు
- తిరిగి బాధితులపైనే కేసులు



రణస్థలం మండలం ఎన్‌జీఆర్‌పురం పంచాయతీ చీకటిపేటలో మూడు రోజుల కిందట కొమర నూకయ్య ఇంటిపై రాళ్లదాడి జరిగింది. ఇంట్లో సామాన్లు, తలుపులు ధ్వంసం చేశారు. దీంతో **నూకయ్య**తోపాటు ఆయన భార్య **సత్తెమ్మ** గాయపడ్డారు. బాధితులు ఫిర్యాదు చేయడంతో టీడీపీ, జనసేన సానుభూతిపరులు ఆరుగురిపై, వైసీపీకి చెందిన ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారు.

(రణస్థలం)

జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో వైసీపీ నేతలు అధికార దాష్టీకాన్ని ప్రదర్శిస్తున్నారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా.. ప్రత్యర్థి పార్టీ నేతలు, కూటమి సానుభూతిపరులపై భౌతికదాడులకు పాల్పడుతున్నారు. బాధితులు ఎవరైనా ప్రశ్నిస్తే.. మమ్మల్నే ఎదిరిస్తార్రా? అంటూ వారిపై అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. తిరిగి వారిపైనే కేసులు నమోదు చేసేలా పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారు. తాజాగా రణస్థలం మండలం ఎన్‌జీఆర్ పురం పంచాయతీ పరిధిలోని ఈ ఘటన వెలుగు చూడడం చర్చనీయాంశమవుతోంది. ఎన్‌జీఆర్‌పురం పంచాయతీ పరిధిలో చీకటిపేట, గురయ్యపేట, పాతయ్యపేట తదితర మత్స్యకార గ్రామాలున్నాయి. ఇక్కడ టీడీపీ, జనసేనకు బలమైన ఓటు బ్యాంకు ఉంది. సుమారు 1,450మంది ఓటర్లు ఉండగా.. స్థానికంగా సరైన నాయకత్వం లేకపోవడంతో వారు ఇబ్బంది పడుతున్నారు. ఈసారి పొత్తులో భాగంగా ఎచ్చెర్ల నియోజకవర్గాన్ని బీజేపీకి కేటాయించారు. దీంతో కూటమి తరపున బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి నడుకుదుటి ఈశ్వరరావు ఎన్నికల ప్రచారానికి.. పార్టీ కార్యక్రమాలకు ఈ పంచాయతీ నుంచి జనసేన, టీడీపీ సానుభూతిపరులు హాజరవుతున్నారు. ఇటువంటి వారిపై వైసీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు తెగబడుతూ.. భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. బాధితులు ప్రశ్నిస్తే.. మమ్మల్నే ఎదిరిస్తార్రా? అంటూ తిట్ల దండకాన్ని అందుకుంటున్నారు. దీంతో చాలా కుటుంబాలు పంచాయతీని విడిచిపెట్టి వేరే గ్రామాల్లో తలదాచుకుంటున్నాయి. ఇంత జరుగుతున్నా పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. పోలీసు పికెట్ ఏర్పాటు చేయాల్సి ఉన్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ నిష్పక్షపాతంగా ఎన్నికలు జరిగేలా చూడా లని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలు ఎన్నికల కమిషన్‌ను కోరుతున్నాయి. దీనిపై ఎన్నికల కమిషన్‌కు, బీజేపీ అగ్రనాయకత్వానికి ఫిర్యాదు చేయనున్నట్టు కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్ తెలిపారు. బాధితులకు అండగా ఉంటామని స్పష్టం చేశారు. దీనిపై కలెక్టర్ తక్షణమే స్పందించాలని విజ్ఞప్తి చేశారు.

29 నామినేషన్లు తిరస్కరణ

- పరిశీలన పూర్తి
- నేటి నుంచి ఉపసంహరణ



నామినేషన్లు పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

శ్రీకాకుళం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ పార్టీల అభ్యర్థుల నామి నేషన్ల పరిశీలన పూర్తయింది. శుక్రవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని రిటర్నింగ్ కార్యాలయాల్లో అధికారులు నామినేషన్లు పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఉన్నవాటిని ఆమోదించారు. నిబంధనలు పాటించని వాటిని, ప్రధాన అభ్యర్థులకు బదులుగా వేసిన నామినేషన్లను తిరస్కరించారు. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్ తోపాటు.. ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి మొత్తం 208 నామినేషన్లు నమోదు కాగా.. 29 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇందులో శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలో 33 నామినేషన్లు రాగా.. మూడు తిరస్కరించారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 175 నామినేషన్లు పడ్డాయి. వీటిలో ఆమదాలవలస -6, నర సన్నపేట -3, పలాస -4, శ్రీకాకుళం -1, ఇచ్ఛాపురం -4, ఎచ్చెర్ల -5, పాతపట్నం -3, టెక్కలి-3 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. పాతపట్నంలో ఇండిపెండెంట్ అభ్యర్థి రెడ్డి శాంతమ్మ.. నామినేషన్ దాఖలు చేసినప్పుడు సరిగ్గా ప్రమాణం చేయలేకపోయారన్న కారణంతో ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతి పేరుతో సరిపోలనుండడంతో.. ఇండిపెండెంట్‌గా నామి నేషన్ వేసిన రెడ్డి శాంతమ్మ నామినేషన్‌ను అధికారం ఉపయోగించి.. తిరస్కరించేలా చేయించారని విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఒకే పేరుతో రెండు ప్రధానపార్టీలకు సంబంధించి నామినే షన్లను ఆమోదించారు. కాగా నామినేషన్ల ఉపసంహరణకు శనివారం నుంచి సోమవారం వరకు గడువుంది. ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన తర్వాత ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్య తేలనుంది.

'ఓటేద్దాం - శ్రీకాకుళం'పై పోటీలు

కలెక్టరేట్, ఏప్రిల్ 26: 'ఓటేద్దాం-శ్రీకాకుళం' అనే అంశంపై వీడియో తయారీ, పోస్టర్ డిజైన్ చేయుటకు ఆన్‌లైన్‌లో పోటీలను నిర్వహిస్తున్నట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అందరూ ఓటింగ్‌లో ఎందుకు పాల్గొనాలనే విషయంపై అవగాహన కలిగేలా ఉండాలి. జిల్లాలో ఓటింగ్ శాతం పెంచడమే దీని ఉద్దేశ్యం. ముఖ్యంగా యువత, మహిళలు, దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్, వలస కార్మికులు, పట్టణ ప్రాంతంతోపాటు గిరిజనులు ఓటింగ్‌లో పాల్గొనేలా సందేశం ఉండాలి. జిల్లాకు చెందిన వారు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనాలి. రెండు.. మూడు నిమిషాల నిడివి వీడియో ఉండాలి. పోస్టర్ సైజు 20ఎంబీ లోపు ఉండాలి. ఎక్కడా పార్టీ గుర్తులు, జెండాలు, రాజకీయ నేతల వ్యాఖ్యలు ఉండరాదు. మే 3వ తేదీలోగా వీడియో/పోస్టర్లను పంపించాలి. ముగ్గురేసి విజేతలను ఎంపిక చేసి నగదు బహుమతులు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేస్తామ'ని కలెక్టర్ తెలిపారు. వీడియో చిత్రీకరణకు ప్రథమ బహుమతిగా రూ.5వేలు, ద్వితీయ, తృతీయ బహుమతిగా రూ.3వేలు, రూ.2వేలు చొప్పున అందజేస్తామన్నారు. పోస్టర్‌కు సంబంధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతి గా.. రూ.3వేలు, రూ.2వేలు, రూ.వెయ్యి చొప్పున అందజేస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 81215 85151 వాట్సాప్ ఫోన్‌నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఎన్డీఏ కూటమిదే విజయం

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- జిల్లా అధ్యక్షుడిగా కలమట బాధ్యతల స్వీకరణ

అరసవల్లి, ఏప్రిల్ 26: 'వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని వదిలించుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి విజయం సాధించడం ఖాయమ'ని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. శుక్రవారం శ్రీకాకుళం 80అడుగుల రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో.. పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడిగా కలమట వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఆయనను అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఘనంగా సన్మానించారు. అనంతరం అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. సీఎం జగన్ రాష్ట్రంలో అన్ని వ్యవస్థలనూ భ్రష్టు పట్టించారని, ఈసారి ఎన్నికల్లో వైసీపీని సాగనంపడం ఖాయమని తెలిపారు. ఎంపీ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. 'జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించడం తథ్యం. పార్టీ కోసం కలమట వెంకటరమణ చేసిన త్యాగం చారిత్రాత్మకమైనది. కలమట అవసరాన్ని గుర్తించే చంద్రబాబు ఆయనను జిల్లా అధ్యక్షుడిగా నియమించార'ని తెలిపారు. కలమట వెంకటరమణ మాట్లాడుతూ.. 'అందరి సహకారంతో టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి విజయం సాధించడం ఖాయం. టికెట్ కేటాయించకపోవడంతో మనస్థాపానికి గురైన మాట వాస్తవమే. కానీ చంద్రబాబు నా సేవలను గుర్తించి పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవించార'ని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తి, జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు పీఎంజే బాబు, బోయిన గోవిందరాజులు, పడాల భూదేవి, చౌదరి బాబ్జీ, కలమట సాగర్, సింతు సుధాకర్, విభూది సూరిబాబు, గుత్తు చిన్నారావు, మెండ దాసునాయుడు పాల్గొన్నారు.



కలమటను సత్కరిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు తదితరులు

ఎన్నికల నియంత్రణ కేంద్రం పరిశీలన

కలెక్టరేట్, ఏప్రిల్ 26: సార్వత్రిక ఎన్నికల వ్యయపరిశీలకులు కోమల్ జిత్ మీనా, శరవణ కుమార్, నవీన్‌కుమార్ సోనీ శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎన్నికల నియంత్రణా కేంద్రాన్ని పరిశీలించారు. మీడియాలో వచ్చే ప్రతికూల వార్తలను నమోదు విధానం, వాటి పరిష్కార తీరుపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కేంద్రం ఇన్‌చార్జి, డీపీవో వేంకటేశ్వర్లు.. ఎంసీఎంసీ, ఎలక్ట్రానిక్ మీడియా, ఎక్స్‌పెండిచర్ మోనటరింగ్. తదితర విభాగాల సిబ్బందిని, వారు నిర్వహిస్తున్న విధులను వివరించారు. పట్టుబడిన నగదు, ఆభరణాలను.. ఆధారాలు.. విచారణ, నిజ నిర్ధారణ అనంతరం అప్పగిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కిరణ్‌కుమార్, ఆడిట్ అధికారి సుల్తానా, సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు, సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు పాల్గొన్నారు.



వివరాలు ఆరా తీస్తున్న ఎన్నికల పరిశీలకులు..



జిల్లాలోని ఇచ్ఛాపురం, సోంపేట, నందిగాం మండలాల్లో రహదారులు దారుణంగా ఉన్నాయి. రోడ్లపై అడుగుకో గొయ్యి దర్శనమిస్తోంది. రోడ్ల నిర్వహణను వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. ఐదేళ్లుగా కనీస మరమ్మతులకు నోచుకోలేదు. దీంతో కనీసం నడవడానికి కూడా వీలులేని విధంగా రోడ్లు తయారయ్యాయి. వీటిపై ఎలా ప్రయాణించేదని సీఎం జగన్‌ను ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గత ఎన్నికల సమయంలో గ్రామీణ ప్రాంతాలకు పక్కారోడ్లు వేస్తామన్న హామీని విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పకీర్‌పేట రోడ్డు దుస్థితి

అడుగుకో గొయ్యి

- అధ్వానంగా గ్రామీణ రోడ్లు • ఎక్కడికక్కడే గోతులు, రాళ్లతో దర్శనం • ఐదేళ్లుగా మరమ్మతులు చేపట్టని వైనం
- నిర్వహణను గాలికొదిలేసిన వైసీపీ సర్కారు • ప్రయాణికులకు తప్పని అవస్థలు

(ఇచ్ఛాపురం)

ఇచ్ఛాపురం మునిసిపాలిటీ, మండలం పరిధిలో పలు రహదారులు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. మునిసిపాలిటీలోని పలు వీధుల్లో దశాబ్దాల కిందట నిర్మించిన రోడ్లే నేటికీ దర్శనమిస్తున్నాయి. 14, 15వ ఆర్థిక సంఘ నిధులు సకాలంలో వినియోగించుకోక పోవడంతో వెనక్కి మళ్లి పోయాయి. అలాగే పలుచోట్ల రోడ్లపనులు చేపట్టినా బిల్లులు సకాలంలో అందడం లేదు. దీంతో మిగతాచోట్ల పనులను చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు.

- మునిసిపల్ వైస్‌ఛైర్‌పర్సన్ ఉలాల భారతిదివ్య ఉంటున్న పకీర్‌పేట రహదారి గోతులమయమై అత్యంత ప్రమాదకరంగా మారింది. ఐదేళ్లగా కనీస మరమ్మతులకు నోచుకోవడంలేదు.
- కోర్టు జంక్షన్ నుంచి పకీరుపేట మీదుగా రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఈ రహదారి గుండా ప్రతిరోజూ వందలాది వాహనాలతోపాటు పాదచారులు, అధి కారులు, కార్మికులు, పరసర ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గోతులమయం కావడంతో రాత్రిపూట రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు ఇబ్బందిపడుతున్నారు.
- పట్టణ పరిధిలోని రత్తకన్నలో పలు వీధుల్లోని రోడ్లు ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. కస్పావీధి, కండ్రవీధి, గౌడ వీధి, కండ్రకాలనీ, అచ్చెంపేట రోడ్లు రాళ్లు తేలాయి.
- డొంకూరు కాజ్‌వే బ్రిడ్జి రోడ్డు గోతులమయమై ప్రమాదకరంగా మారింది. ఇక్కడ గోతులు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా కనీస మరమ్మతులు చేపట్టడంలేదు. ఇటీవల వాహన చోదకుల అవస్థలను గుర్తించిన జనసేన కార్యకర్తలు శ్రమదానం చేసి గోతులు పూడ్చారు.
- పురుషోత్తపురం నుంచి కేదారిపురం, ముచ్చింద్ర, బెనుగానిపేట వరకు రోడ్డు అడుగడుగునా గోతులతో దర్శనమిస్తోంది. ఈ మార్గంలో ఇచ్ఛాపురంలోని కళాశాలలకు సైకిళ్లపై రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు, ద్విచక్రవాహన చోదకులు అవస్థలకు గురవుతున్నారు. గోతులతో సైకిళ్లు పంక్చర్లు కావటంతో కొన్నిసార్లు నడిపించుకుని పాఠశాలలకు వెళ్తున్నామని, తాత్కాలికంగా చేసిన రోడ్డు ప్యాచ్‌వర్క్‌ల్లో కూడా నాణ్యత లేకపోవడంతో వారంరోజులకే రాళ్లుఊడి పోతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు.
- మండలంలోని కేదారిపురం, ముచ్చింద్ర, మండపల్లి, టి.బరంపురం, శాసనం, డొంకూరు, రహదారులు దారుణంగా ఉన్నాయి. ఈదుపురం నుంచి బూర్జపాడు వరకు ఉన్న రోడ్డు టీడీపీ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి చేశారు. ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం ఈ రోడ్డులో చిన్న చిన్న మరమ్మతులు సైతం చేయకపోవడంతో అవస్థలు తప్పడం లేదని వాహన చోదకులు చెబుతున్నారు.



డెప్పూరు రోడ్డుపై గోతుల్లో నీరుచేరిన దృశ్యం



అరకభద్ర రోడ్డు పరిస్థితి..



పురుషోత్తపురం రహదారి..



డొంకూరు కాజ్‌వేపై గోతులను పూడుస్తున్న యువకులు (ఫైల్)



బెనుగానిపేట సమీపంలో రాళ్లు తేలిన దృశ్యం



కేదారిపురం రోడ్డు ఇలా..

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

సోంపేట: జాతీయరహదారి నుంచి బేసిరామ చంద్రాపురం నుంచి బాతుపురం వరకు సుమారు 16 కిలోమీటర్ల రహదారి అడుగడుగునా గోతులతో దర్శనమిస్తోంది. బాతుపురం నుంచి సోంపేటకు నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. ప్రధాన రహదారిగా ఉన్న ఈ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నా కనీస మరమ్మతులకు చర్యలు తీసుకోవడంలేదు. గోతులతో ఒళ్లు హూనమవుతుందని, వాహనాలు పల్టీలు కొడుతున్నాయని వాహన చోదకులు వాపోతున్నారు. జాతీయ రహదారి నుంచి బేసిరామచంద్రాపురం మీదుగా బాతుపురం వరకు ఉన్న 15.8 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.30కోట్లతో ప్రతిపాదనలు పంపించినట్లు ఆర్అండ్‌బీ జేఈ మోహనరావు తెలిపారు.

బేసిరామచంద్రాపురం-బాతుపురం రోడ్డు



శిలాఫలకాలు వేసి.. పనులు మరచి..

(నందిగాం)

నందిగాంకు సుదూర ప్రాంతంలో ఉన్న ఉయ్యాలపేటకు పక్కా రహదారి కలగానే మిగిలింది. వరదలొస్తే ముంపునకు గురయ్యే ఈ గ్రామానికి సరైన రహదారి లేకపోవడంతో ఇక్కట్లు తప్పడంలేదు. ముంపు సమయంలో బిక్కుబిక్కుమని బాహ్య ప్రపంచానికి దూరంగా కాలం గడుపుతున్న తమకు పాలకుల హామీలే తప్ప రోడ్డు నిర్మాణానికి నోచుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. రహదారి నిర్మాణానికి శిలాఫలకాలు ఆవిష్కరించి గ్రామస్థుల సత్కారాలు పొందిన తర్వాత మరిచిపోతున్నారు. పుష్కరకాలంలో మూడు శిలాఫలకాలు ఈ రహదారి నిర్మాణానికి మంత్రులు వేసినా పనులు జరగలేదు. 2012లో వరదల సమయంలో రెవెన్యూ సిబ్బందిని గ్రామస్థులు రహదారి కోసం నిర్బంధిస్తే అప్పటి కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, అప్పటి రాష్ట్రమంత్రి ధర్మాన ప్రసాదరావు తుఫాన్ నిధులు మంజూరుచేసి శిలా ఫలకాలు వేశారు. కానీ పనులు జరగకపోవడంతో రహదారి కష్టాలు తప్పడంలేదు. 2018లో అప్పటి రాష్ట్రమంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మరోసారి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినా ప్రభుత్వం మారిపోవడంతో పనులు ముందుకుసాగలేదు. రహదారికి రక్షణగోడతో పాటు మెటల్ పరిచి పనులు చేశారు. తర్వాత పనులు పూర్తికాకపోవడంతో రాళ్లుతేలి వాహన చోదకులు, పాదచారులకు అగచాట్లు తప్పడంలేదు. దీంతో స్థానిక యువత ఈనెల ఏడో తేదీన దీపాలతో నిరసన ర్యాలీ చేపట్టి రహదారి నిర్మించే వరకు ఎన్నికలను బహిష్కరిద్దామని పిలుపునిచ్చారు.



గ్రామంలో నిరసన ర్యాలీ చేస్తున్న యువకులు (ఫైల్)



రాళ్లు తేలిన ఉయ్యాలపేట రహదారి

జన కేతనం



లోక్‌సభ ఎన్నికల్లో అతనిదే ‘రాజ’సం

- ఆరుసార్లు ఎంపీగా గెలిచిన బొడ్డేపల్లి రాజగోపాలరావు • నాలుగుసార్లు ఎర్రన్నాయుడు.. • రెండేసిసార్లు ఎన్నికైన కణితి, రామ్మోహన్‌నాయుడు

(టెక్కలి)

జిల్లాకు సంబంధించి 1952 నుంచి 2019 వరకు 18 సార్లు లోక్‌సభ ఎన్నికలు జరుగగా అందులో ఆరుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా బొడ్డేపల్లి రాజగోపాల రావు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. అలాగే కింజరాపు ఎర్రన్నాయుడు నాలు గుసార్లు, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుడు కింజరాపు రామ్మోహన్‌నాయుడు రెండుసార్లు, డాక్టర్ కణితి విశ్వనాథం రెండుసార్లు, హనుమంతు అప్పయ్య దొర, ఎన్‌జీ రంగా, డాక్టర్ కిల్లి కృపా రాణి, గౌతు లచ్చన్న ఒక్కొక్కసారి పార్లమెంట్ సభ్యులుగా ఇప్పటివరకు పనిచేశారు.

రాజగోపాలరావు..

తొలిసారి 1952లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన బొడ్డేపల్లి రాజగోపాలరావు కాంగ్రెస్ అభ్యర్థి పీఎల్ఎస్ రాజుపై 9,399 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. రెండోసారి 1957లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి కరిమి నారాయణ అప్పలనాయుడుపై 16,356 ఓట్ల మెజార్టీతో, మూడోసారి 1962లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి స్వతంత్ర అభ్యర్థి ఎస్.శ్రీనివాసరెడ్డిపై 31,815 ఓట్లతో, నాలుగోసారి 1971లో కాంగ్రెస్ నుంచి పోటీచేసి స్వతంత్ర అభ్యర్థి ఎన్‌జీ రంగాపై 1,37,461 ఓట్ల మెజార్టీతో, ఐదోసారి 1977లో కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేపల్లి రాజగోపాలరావు బీఎల్‌డీ అభ్యర్థి గౌతు లచ్చన్నపై 8,734 ఓట్లతో, ఆరోసారి 1980లో కాంగ్రెస్(ఐ) అభ్యర్థిగా రాజగోపాలరావు పోటీచేసి జనతా(ఎస్) అభ్యర్థి గౌతు లచ్చన్నపై 78,980ఓట్ల మెజార్టీతో గెలుపొందారు.

ఎర్రన్నాయుడు..

1996లో తెలుగుదేశం పార్టీ తరఫున కింజరాపు ఎర్రన్నాయుడు పోటీ చేసి అన్నా టీడీపీ అభ్యర్థి నందమూరి జయకృష్ణపై 34,578 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. 1998లో టీడీపీ నుంచి బరిలోకి దిగి అన్నా టీడీపీ అభ్యర్థి హనుమంతు అప్పయ్యదొరపై 86,365 ఓట్లతో, 1999లో టీడీపీ నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి కణితి విశ్వనాథంపై 96,882 ఓట్లతో, 2004లో టీడీపీ తరఫున ఎర్రన్నాయుడు పోటీచేసి కాంగ్రెస్ అభ్యర్థి కృపారాణిపై 32,059 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు.



గౌతు లచ్చన్న




బొడ్డేపల్లి రాజగోపాలరావు



హనుమంతు అప్పయ్యదొర



ఎర్రన్నాయుడు



కణితి విశ్వనాథం



రామ్మోహన్‌నాయుడు



కృపారాణి

మిగతా అభ్యర్థులు..

- 1989లో కాంగ్రెస్ పార్టీ తరఫున డాక్టర్ కణితి విశ్వనాథం పోటీచేసి టీడీపీకి చెందిన హనుమంతు అప్పయ్య దొరపై 50,144 ఓట్లుతో, 1991లో కాంగ్రెస్ నుంచి మరోసారి కణితి విశ్వనాథం పోటీచేసి టీడీపీకి చెందిన హను మంతు అప్పయ్యదొరపై 26,664 ఓట్లతో గెలుపొందారు.
- 2014లో టీడీపీ అభ్యర్థి కింజరాపు రామ్మో హన్‌నాయుడు వైసీపీ అభ్యర్థి రెడ్డి శాంతిపై 1,27,572 ఓట్లు, 2019లో టీడీపీ అభ్యర్థి రామ్మోహన్‌నాయుడు వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌పై 6,653 ఓట్లతో విజయం సాధించారు.
- 1967లో స్వతంత్ర్య అభ్యర్థి గౌతు లచ్చన్న కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేపల్లి రాజ గోపాలరావుపై 60,358 ఓట్లతో గెలు పొందారు.
- 1967 పార్లమెంట్ ఉప ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి ఎన్‌జీ రంగా కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డే పల్లి రాజగోపాలరావుపై 52,644 ఓట్లతో గెలుపొందారు.
- 1984లో టీడీపీ అభ్యర్థి హనుమంతు అప్ప య్యదొర కాంగ్రెస్ అభ్యర్థి బొడ్డేపల్లి రాజగోపాలరావుపై 1,24,468 ఓట్లతో విజయం సాధించారు.
- 2009లో కాంగ్రెస్ అభ్యర్థి కిల్లి కృపారాణి టీడీపీ అభ్యర్థి కింజరాపు ఎర్రనాయుడుపై 82,987 ఓట్లతో గెలుపొందారు. ఈ ఎన్నికల్లో టీడీపీ నుంచి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వైసీపీ నుంచి పేడాడ తిలక్‌లు పోటీ చేస్తున్నారు.

మచ్చలేని వ్యక్తిత్వం.. ముక్కుసూటి తనం

- సోంపేట, పలాస నియోజవకవర్గాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక • విలక్షణం శివాజీ శైలి



గౌతు శ్యామసుందరశివాజీ

పలాస: గౌతు శ్యామసుందర శివాజీ ఈ పేరు చెప్పగానే ఉద్దానం ప్రాంతం గుర్తొస్తుంది. తండ్రి లచ్చన్న వారసత్వం పునికిపుచ్చుకున్నారు. మచ్చలేని వ్యక్తిత్వం.. ముక్కుసూటి తనానికి మారు పేరుగా నిలిచారు. పబ్లిక్ సమావేశాల్లోనైనా..అధినాయకుడివద్దనైనా...ఒకటే తీరుగా వ్యవహరించేవారు. శివాజీ పనైయితే రాష్ట్రంలోని ఏ మంత్రైనా, ఐఏఎస్, ఐపీఎస్ అధికారైనా ఒకే చెప్పేవారు. ఎందుకంటే ఆయన శైలి అటువంటిది. దీని వల్లే అయన్ను పలాస, సోంపేట నియోజకవర్గాల ప్రజలు ఆరుసార్లు అసెంబ్లీకి పంపించారు.

కార్యకర్తల మాటే వేదవాక్కు..

ఎమ్మెల్యేగా పిలవడం కంటే గౌతు లచ్చన్న కుమారుడిగా పిలిస్తేనే శివాజీ సంబరపడిపోతారు. ముక్కుసూటి తనం, పనిలో నిబద్ధత, ఇచ్చిన మాటకు జవదాటని వ్యక్తిత్వం, కార్యకర్తల మాటే వేదవాక్కు, ప్రజల్లో నమ్మదగిన మనిషిగా శివాజీ మంచి గుర్తింపుపొందారు. తండ్రి వారసత్వం నుంచి రాజకీయాల్లోకి వచ్చిన ఆయన ఓటమి ఎరగకుండా సోంపేట నియోజకవర్గంలో ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. సోంపేట రద్దైన తర్వాత ఏర్పడిన పలాస నియోజకవర్గంలో 2009 లో ఓటమి పాలయ్యారు. మళ్లీ తర్వాత ఎన్నికల్లో అక్కడి నుంచి గెలుపొందారు.

శివాజీ ప్రస్థానం..

టీడీపీ ఏర్పాటు చేసిన తర్వాత 1984లో పార్టీలో చేరారు. తొలిసారిగా 1985లో ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందారు. 1989, 1994, 1999, 2004, 2014 ఎన్నికల్లో వరుసగా విజయం సాధించారు. 2019 రాజకీయాలను విరమించుకున్నట్లు ప్రకటించడంతో ఆయన వారసత్వాన్ని పెద్ద కుమార్తె గౌతు శిరీష కొనసాగిస్తున్నారు.

- శివాజీకి ఎన్టీయార్ 1989లో టిక్కెట్ నిరాకరించడంతో ఆయన తనతోడు-నీడగా పిలిచే కింజరాపు ఎర్రన్నాయుడుతో కలిసి ఇద్దరూ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలుపొందారు. ఈ విజయం ఆయనకు ప్రజల్లో ఉన్న అభిమానాన్ని చాటి చెప్పిందని సాక్ష్యాత్తు ఎన్టీఆర్ ప్రకటించడం విశేషం. తర్వాత ఎన్నికల్లో ఆయన్ను టీడీపీలోకి ఆహ్వానించారు.
- ఎమ్మెల్యేగా ఎన్నికైన తొలినాళ్ల నుంచి దూకుడుగా ఉండేవారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో ఆఫ్‌షోర్ రిజర్వాయర్‌కు ప్రభుత్వం నిధులు విడుదలచేయకపోతే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిని ఆకర్షించి ఆ పనుల నిర్వహణకు గెడ్డం దీక్షచేశారు. ముడు నెలలపాటు ఈ దీక్ష సాగడంతో ముఖ్యమంత్రి స్పందించి ఆఫ్‌షోర్‌కు ఏకంగా రూ.466 కోట్లు విడుదలచేశారు. అప్పట్లో జడ్పీ, ఐటీడీఏపాలకవర్గం సమావేశంలో శివాజీ అధికారపక్షమైనా స్వపక్షంలో విపక్షంగా మారి సమస్యలపై మంత్రులు, అధికారులను సైతం నిలదీసేవారు.

టీడీపీలో విలీనమైన లోక్‌దళ్..

రాష్ట్ర, దేశ రాజకీయాల్లో చెరగని ముద్రవేసుకున్న స్వతంత్ర సమరయోధుడు గౌతు లచ్చన్న తన పార్టీ లోక్‌దళ్‌ను టీడీపీలో 1983లో విలీనం చేశారు. ఆయనతో అప్పటి వరకు రాజకీయాల్లో పాలుపంచుకొని ఉన్న శిష్యులు సుంకరి సత్యనారాయణ(కృష్ణాజిల్లా), వడ్డే శోభనాదీశ్వరరావు, యలమంచిలి శివాజీ, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, తుమ్మల చౌదరి వంటి వారు టీడీపీలో చేరి వివిధ పదవులు పొందారు. ఈ క్రమంలో లచ్చన్న పెద్ద కుమారుడు శివాజీ 34 ఏళ్ల వయసులోనే రాజకీయాల్లోకి వచ్చారు.

సోంపేట వారికి కంచుకోట..

గౌతు కుటుంబానికి సోంపేట కంచుకోటలా మారింది. తొలుత లచ్చన్న ఎన్నికయ్యారు. తర్వాత 1962లో స్వతంత్ర అభ్యర్థిగా సోంపేట నియోజకవర్గం నుంచి గెలుపొందారు. తర్వాత 1967, 1978లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో పాటు ఎమ్మెల్సీ కూడా బాధ్యతలు నిర్వహించారు. తండ్రీ కుమారులు లచ్చన్న, శివాజీలు దశాబ్దాల పాటు ప్రజా ప్రతినిధులుగా సోంపేటకు సేవలందించారు. లచ్చన్నకు గురువు పుల్లెల శ్యామసుందరరావు అంటే ఎంతో ఇష్టం. దీంతో తన కుమారుడికి గౌతు శ్యామసుందరశివాజీ అని పేరు పెట్టుకున్నారు. శివాజీకి శిరీష, అనురాధ కుమార్తెలు ఉండగా శిరీష ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉండగా, పలాస నియోజకవర్గం నుంచిపోటీ చేస్తున్నారు.



ఎన్టీరామారావుతో శివాజీ, ఆయన అనుచరులు

పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైతే..

మీకు తెలుసా?

గార: ఏ కారణంతోనైనా పోలింగ్ ప్రారంభం కావడం ఆలస్యమైతే సమయం పెంచరు. నిర్ణీత సమయానికి క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతిస్తారు. ఎంత రాత్రయినా సరే వారంతా ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రంలో గానీ, కేంద్రానికి వంద మీటర్ల పరిధిలో గానీ అభ్యర్థి, మరే వ్యక్తి కూడా ఫలానా గుర్తు, వ్యక్తికి ఓటు వేయాలని ప్రచారం చేయకూడదు. గ్రామాలు, పోలింగ్ కేంద్రాల పరిధిలో ఏదైనా కారణాలతో ఓటింగ్ బహిష్కరిస్తే రీపోలింగ్ నిర్వహించరు. పోలింగ్ కేంద్రంలోకి వెళ్లడానికి అభ్యర్థి గన్‌మన్‌కు అనుమతిలేదు. ఒకవేళ ఓటు వేసేందుకు గన్‌మన్ వస్తే తన ఆయుధాన్ని బయట ఉన్న పోలీసుల వద్ద ఉంచి ఓటు వేసి తిరిగి వచ్చి తీసుకోవాలి. ఓటు వేసేటప్పుడు ఫొటోలు తీయడం, వీడియో చిత్రీకరణ నేరం. ఇది రహస్య ఓటింగ్‌కు భంగం కలిగిస్తుంది.

గత చరిత్ర



ఒక మండలం.. మూడు నియోజకవర్గాలు

- పాలకొండ, ఎచ్చెర్ల, చీపురుపల్లితో కలిసి ఎన్నికలు
- ఇదీ 2009 వరకు పొందూరు పరిస్థితి

పొందూరు: పొందూరు మండలానికి 2009 వరకు ప్రత్యేకత ఉండేది. పూర్తిగా భౌగోళికంగా శ్రీకాకుళం జిల్లాలో ఈ మండలం కొనసాగినా అప్పటివరకు విజయ నగరం జిల్లా చీపురుపల్లి నియోజకవర్గంలో కొంత ప్రాం తం ఉండేది. 2009లో దేశవ్యాప్తంగా జరిగిన నియోజక వర్గాల పునర్విభజనలో ఆమదాలవలస నియోజవకవ ర్గంలోకి పొందూరు మండలం చేరింది. 1971లో పునర్విభజన మేరకు 2009 వరకు పొందూరు మండలం చీపురుపల్లి నియోజకవర్గంలో ఉన్నా కొన్ని పంచాయతీలు అప్పటి ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని పాలకొండ, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో ఉండేవి. పొందూరు మండలంలోని చెందిన గోకర్ణపల్లి పంచాయతీ పాలకొండ నియో జకవర్గంలో, కేశవదాసుపురం, నందివాడ, బి.కంచరాం ఎచ్చర్ల నియోజకవర్గంలో కూడా ఉండేవి. దీంతో ఆయా పంచాయతీల నాయకులు, ప్రజలు పనుల కోసం ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేల వద్దకు వెళ్లాల్సి వచ్చేది. అయితే 2009లో పునర్విభజన తర్వాత మండలం మొత్తం ఆమదాలవలస నియోజకవర్గంలో చేరడంతో నాలుగు దశాబ్దాలుగా ఆయా పంచాయతీల ప్రజలు పడుతున్న వెతలు తప్పాయి.

సోషల్.. సెల్.. మీడియా!

ఎన్నికలంటే హోరెత్తించే మైకులు.. గోడల మీద రాతలు.. లక్షలకొద్దీ కరపత్రాలు.. ఊరూవాడా వాల్‌పోస్టర్లు.. ఇదంతా గతం. ప్రచార సరళి ప్రస్తుతం పూర్తిగా మారిపోయింది. ప్రచారంలో సెల్‌ఫోన్ కీలక పాత్ర పోషి స్తోంది. ముఖ్యమైన సమా చారాన్ని క్షణాల్లో తమ అనుచ రులకు చేరవేస్తు న్నారు. అభ్య ర్థులకు సమయం ఎంతో ఆదా అవుతోంది. సామా జిక మాధ్యమాలను తమ ప్రచారాలకు ప్రధా న సాధనాలుగా వాడుకుం టున్నారు.

- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల్లో ప్రచారం
- యూట్యూబ్‌లో అప్‌లోడ్.. లైవ్ వీడియోలు
- ప్రచారాల ఫొటోలు కూడా..





(నరసన్నపేట)

గత ఎన్నికల్లో ఎస్సెమ్మెస్‌లకే పరిమితమైన ప్రచారం.. ఈసారి ఆధునికతను అందిపుచ్చుకుంది. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని రాజకీయ పార్టీల నాయకులు ప్రజల్లోకి దూసుకు పోతున్నారు. సోషల్ మీడియా ఇప్పుడు ప్రధాన పాత్ర పోషిస్తోంది. తమ నాయకుడు ఏ రోజు.. ఏ సమయానికి.. ఏ వీధికి.. ఏ ప్రాంతానికి, ఏ గ్రామానికి ప్రచారానికి వస్తున్నారో సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఆ ప్రాంతాలకు వెళ్లిన క్షణాల్లోనే ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేస్తున్నారు. ఇందుకోసం అన్ని పార్టీల అభ్యర్థులూ ఒక్కొక్కరు కనీసం నలుగురైదుగురిని నియమించుకొని.. తమ రోజువారీ కార్యక్రమాలను ప్రజలకు చేరవేస్తున్నారు.

లైవ్ వీడియోలు..


దాదాపుగా ప్రచారంలో లైవ్ వీడియోలకు ప్రాధాన్యం పెరిగింది. నాయకుడు గ్రామంలోనికి అడుగుపెట్టింది మొదలు ప్రజలతో మమేకమవుతూ... తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థిస్తున్న ప్రతి సన్నివేశాన్ని లైవ్‌ద్వారా ఫేస్‌బుక్... యూట్యూబ్‌లలో ప్రచారం చేస్తున్నారు. అభిమానులు, కార్యకర్తలు కూడా ఇదే పంథాలో నాయకులను అనుసరిస్తున్నారు.

వాట్సాప్ గ్రూపుల్లో...

ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రతి అంశాన్ని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి వాట్సాప్ గ్రూపుల ద్వారా వందలాది మందికి చేరవేస్తున్నారు. పార్టీలు, కులాలు, కుటుంబాలు, ఉద్యోగ సంఘాలు, మీడియా, అధికారులు, ఇతరత్రా గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. అక్కడి నుంచి క్షణాల్లో మిగిలిన వారు షేర్ చేస్తున్నారు. దీంతో అత్యంత వేగంగా ప్రచారం జనంలోకి వెళ్లిపోతోంది. ఫలితంగా తక్కువ ఖర్చు...స్వల్ప సమయంలో వేలాదిమందికి సమాచారం చేరవేస్తున్నారు.

యూట్యూబ్‌లో...

ప్రస్తుతం యూట్యూబ్‌కు ఉన్న ప్రాధాన్యం అంతా ఇంతా కాదు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు ప్రత్యేకంగా వీడియోలను తయారు చేయిస్తున్నారు. పార్టీల హామీలను... గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... భవిష్యత్‌లో చేయబోయే అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ... వీడియోలను యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. లక్షలాది మంది వీక్షకులకు చేరువయ్యే ప్రయత్నం చేస్తున్నారు.



అందరిదీ అదే బాట..

జిల్లాలో ఏడు నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ నియోజకవర్గాల నుంచి కూటమి, అధికార పార్టీల నుంచి 14 మంది శాసనసభకు.. ఇద్దరు లోక్‌సభకు పోటీలో ఉన్నారు. నామినేషన్ల పర్వం పూర్తయ్యేసరికి మరికొంత మంది అభ్య ర్థులు బరిలో ఉండే అవకాశాలు లేకపోలేదు. వీరిలో కూటమి, అధికార పార్టీలకు చెందిన అభ్యర్థులు ప్రత్యేకంగా సోషల్‌మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. తమ ప్రచారానికి సంబంధించిన ప్రతి చిన్న విషయం ప్రజల్లోకి చొప్పిస్తున్నారు. అన్నివర్గాల ప్రజలు సైతం ఎప్పటికప్పుడు లైవ్‌లో వస్తున్న ప్రచారా లను చూసి తమకు నచ్చినవారి ప్రచారాలు 'షేర్' చేస్తున్నారు. అభ్యర్థుల గుణగణాలతో పాటు వారి హయాంలో నియోజకవర్గంలో అభివృద్ధి జరిగితే అభినందిస్తు న్నారు. ఉత్సవ విగ్రహాలుగా అధికారాన్ని అనుభవించిన వారి పట్ల దురుసుగానే కామెంట్ల రూపంలో జవాబులిస్తున్నారు.

రూపాయి ఖర్చు చేస్తే ఒట్టు!

- లోగయి ఆనకట్టపై సర్కారు నిర్లక్ష్యం
- పిచ్చిమొక్కలతో నిండిన కాలువలు
- దెబ్బతిన్న షటర్లు.. రైతులంటే అలుసా?
- సాగునీరు అందక ప్రతి ఏటా నష్టాలే
- కన్నెత్తిచూడని మంత్రి అప్పలరాజు

మండలం: మందస
సాగునీటి వనరు: లోగయి ఆనకట్ట
నిర్మాణం: సునాముది గెడ్డపై గోవిందపురం వద్ద
ఆయకట్టు: సుమారు 4,500 ఎకరాలు
గ్రామాల పరిధి: 15


అభివృద్ధికి నోచుకోని లోగాయి ప్రధాన ఆనకట్ట

(హరిపురం)

సునాముది గెడ్డపై రాజుల కాలంలో నిర్మించిన లోగయి ఆనకట్ట వైసీపీ పాలకుల నిర్లక్ష్యానికి గురవుతోంది. సుమారు పన్నెండు గ్రామాల పరిధిలో 4,500 ఎకరాలకు సాగునీరందించే ఆనకట్ట కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏడేళ్ల కిందట నీరు-చెట్టు కింద రూ.20 లక్షలతో లోగయి ఆనకట్టకు మరమ్మతులు చేశారు. 2019లో తితలీ తుఫాన్‌తో ఆనకట్ట షట్టర్లు విరిగిపోవడంతో పాటు కాలువలు దెబ్బతిన్నాయి. దీంతో ప్రస్తుతం ఈ కాలు వల ద్వారా చుక్కనీరు ప్రవహించని దుస్థితి నెలకొంది. శివారు భూములు కరవు కోరల్లో చిక్కుకుంటున్నాయి. రైతు ప్రభుత్వంగా చెప్పుకున్న వైసీపీ ప్రభుత్వం కాలువల అభివృద్ధికి ఐదేళ్లుగా కనీసం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదు.

ఇదీ ఆనకట్ట పరిస్థితి..

గోవిందపురం వద్ద సునాముది గెడ్డపై 500 మీటర్ల పొడవుతో, నాలుగు భాగాలుగా విభజించి లోగయి ఆనకట్టను రాజుల కాలంలో నిర్మించారు. దీనిద్వారా మందస మండలంలోని గోవిందపురం, కొత్తపల్లి, వీవీఆర్‌పురం, టి.శాసనాం, ముకుందపురం, సోంపేట మండలంలోని అనంతపురం, మూలూరు, గొల్లూరు తదితర 15 గ్రామాల్లో 4,500 ఎకరాల ఆయకట్టుకు గతంలో రెండు పంటలకు పుష్కలంగా నీరందేది. తితలీ తుఫాన్ తర్వాత ఐదేళ్లుగా ఎటువంటి మరమ్మతులకు నోచుకోకపోవ డంతో ఆనకట్ట శిథిలావస్థకు చేరింది. దీంతో నీరు నిల్వ ఉండడం లేదు. షట్టర్లు సైతం తుప్పు పట్టిపోయాయి. ఫలితంగా సునాముది గెడనీరు వృథాగా సముద్రంలో కలిసిపోతోంది. దీంతో వేలాది ఎకరాల శివారు ఆయకట్టుకు నీరందక ఏళ్లగా కరవు కోరల్లో చిక్కుకుంటున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి చివరి తడులకు నీరందక రైతన్నలు దైన్యపరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

మరమ్మతులకు నోచుకోని షట్టర్లు

లోగయి ఆనకట్టను మంత్రి సీదిరి అప్పలరాజు కనీసం ఐదేళ్లలో ఒక్కసారి కూడా పరిశీలించలేదు. కొత్తపల్లిలో ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించేందుకు మంత్రి వచ్చిన సమయంలో ఆనకట్ట సమస్యను స్థానిక రైతులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే, ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయలేదు. నాలుగు భాగాలుగా ఉన్న ఆనకట్టు ఒక్క భాగం మాత్రమే ఏడేళ్ల కిందట మరమ్మతులకు నోచుకుంది. అప్పట్లో నీరు-చెట్టు కింద సుమారు రూ.20లక్షలతో పనులు జరిపి తాత్కాలిక ఉపశమనం కలిగించారు. రెండో విడత నీరు-చెట్టు పథకం కింద రూ.రెండు కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు చేశాయి, అయితే ప్రభుత్వం మారడంతో నిధులు మంజూరు కాలేదు. దీంతో షట్టర్లు మరమ్మతులకు నోచుకోలేదు.


కాలువలో పిచ్చిమొక్కలు నిండి నీరు పారని దృశ్యం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం



ఆనకట్ట షట్టర్లు విరిగిపోవడంతో నీరు వృథాగా పోతోంది. దీంతో మదుములు, తూముల వద్ద ఇసుక బస్తాలు నింపి అడ్డుగా వేస్తున్నాం. నీటి ప్రవాహం ఎక్కువైతే ఆనకట్టలో దిగేందుకు సాహసం చేయాల్సి వస్తుంది. తూములు సైతం మధ్యలో ఉన్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- కుమార్, ఆయకట్టు రైతు, బిన్నల

షట్టర్లు ఏర్పాటు చేయాలి



వైసీపీ ప్రభుత్వం రైతుల సమస్యలను కనీసం పట్టించుకోలేదు. లోగయి ఆనకట్ట మదుములకు పూర్తిస్థాయిలో షట్టర్లు ఏర్పాటు చేయాలి. దెబ్బతిన్న షట్టర్లను బాగు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి. ఇప్పటికైనా శివారు భూములకు నీరందించాలి.

- కొర్ల హేమారావుచౌదరి, రైతు సంఘప్రతినిధి, మందస


ఎడమ కాలువ మదుముకు షట్టరు లేని దృశ్యం


కుడికాలువ మదుము వద్ద ధ్వంసమైన షట్టరు

'ఉపాధి'కి గండి కొడుతున్న

ఎన్నికల ప్రచారం






సరుబుజ్జిలి: రాజకీయ నాయకులు చేపడుతున్న ఎన్నికల ప్రచారంతో కూలీల ఉపాధికి గండి పడుతోంది. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వేతనదారులు నష్టపోతున్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలోని పొందూరు, సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస మండలాల్లో ముమ్మరంగా ఉపాధి పనులు సాగుతున్నాయి. తీవ్రమైన ఎండ ప్రభావం చూపడంతో కూలీలు ఉపాధి పనులు వేగంగా ముగించుకొని ఇంటికి చేరుకోవడానికి పాటుపడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వివిధ పార్టీల అభ్యర్థులు వెళ్లి ప్రచారం చేస్తుండడంతో పని గంటలు తగ్గి కూలీలు కొంతమేర ఆదాయాన్ని కోల్పోతున్నారు. కాలువలు, గెడ్డలు ఇతర ప్రాంతాల్లో పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి రోజుకు ఇద్దరు, ముగ్గురు అభ్యర్థులు వెళ్లి ఓట్లు అడుగుతున్నారు. నిర్దేశించిన పనులను చేస్తుండగా అభ్యర్థులు ప్రచారాలకు రావడంతో కూలీలంతా ఒక చోటకు చేరుతున్నారు. ఎన్నికల ప్రచారానికి వస్తున్నారని, అందరూ ఒకచోటకు రావాలని స్థానిక నాయకులు హుకుం జారీచేస్తుండడంతో వారంతా పనులను అరగంట పాటు నిలిపివేస్తున్నారు. దీనివల్ల పని గంటలు తగ్గి అనుకున్నంత వేతనం రావడం లేదని కూలీలు వాపోతున్నారు.

ఒక్క ఓటు..

- ఎన్నో ప్రభుత్వాలు తారుమారు

విలువ



(నరసన్నపేట)

మనం ప్రయాణించాల్సిన బస్సో, రైలో మిస్ అయితే కాస్త ఆలస్యంగానైనా గమ్యస్థానం చేరుకోవచ్చు. అదే ఓటు వేయకపోతే మళ్లీ ఐదేళ్ల వరకూ ఆ అవకాశం రాదు. మన ఒక్క ఓటే కదా.. అని నిర్లక్ష్యం చేయవద్దు. ఒక్క ఓటే చరిత్రలో సంచలనాలు సృష్టించింది. ఒక్క ఓటుతో ప్రభుత్వాలు కూలిపోయాయి. నిలబడ్డాయి కూడా. ఒక్క ఓటుతో ప్రపంచంలో పలు ప్రభుత్వాలు మారిపోయాయి.

- 1999లో ఒక్క ఓటు తేడాతో వాజ్‌పేయి అధికారాన్ని కోల్పోయారు.
- ఒక్క ఓటు తేడాతో ఆంగ్లంపై గెలిచి హిందీ మన దేశ జాతీయ బాషగా అధికార గుర్తింపు పొందింది.
- 2008లో రాజస్థాన్ శాసనసభ ఎన్నికల్లో ఆ రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు సీపీ జోషి ఒక్కఓటు తేడాతో ఓడిపోయారు. గెలిచి ఉంటే ఆయనే ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉండేది.
- 1776లో అమెరికాలో ఒకేఒక్క ఓటు తేడాతో జర్మన్‌కు బదులుగా ఇంగ్లీష్ అధికార భాషగా మారింది.
- 1714లో ఒక ఓటు తేడాతో కింగ్ జార్జి-1 ఇంగ్లండ్‌లో పీఠమెక్కారు.
- 1800లో థామస్ జెఫర్‌సన్, 1824లో జాన్ క్విన్స్ ఆడమ్స్ 1876లో రూథర్‌ఫర్డ్ హేమ్స్‌లు ఎలక్టోరల్ కాలేజ్‌లో ఒకే ఒక్క ఓటు తేడాతో అమెరికా అధ్యక్షులుగా పదవులను అధిష్ఠించారు. ● 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఒకేఒక్క ఓటు తేడాతో అడాల్ఫ్ హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయాడు.

త్రిసభ్య ఎన్నికల కమిషన్ ఏర్పాటు

మీకు తెలుసా?

హిరమండలం: ఏకసభ్య ఎన్నికల సంఘాన్ని 1993లో రద్దుచేశారు. అప్పటివరకు ఒక సీఈసీ మాత్రమే ఉండేవారు. అప్పటి కేంద్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ స్థానంలో త్రిసభ్య ఎన్నికల కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఒక ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇద్దరు కమిషనర్లు ఉంటారు. ప్రస్తుతం ముగ్గురి కేంద్ర ఎన్నికల కమిషన్ కొనసాగుతోంది. ● రాష్ట్ర స్థాయిలో ఎన్నికల కమిషన్‌కు సహకారిగా ఎన్నికల ప్రధాన అధికారి(చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్) ఉంటారు. ● మొదటి మహిళా ప్రధాన ఎన్నికల కమిషనర్ వీఎస్ రమాదేవి వ్యవహరించారు. ● భారత్‌లో ఈవీఎంలను డిజైన్ చేసిన వ్యక్తిగా ఎంబీ హనఫ్ గుర్తింపు పొందారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


ప్రభావతి (ఫైల్)

మెళియాపుట్టి: మెళియాపుట్టి మండల కేంద్రంలో గురజాడ ప్రభావతి (50) అనుమానా స్పద స్థితిలో మృతి చెందినట్లు ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మెళియాపుట్టి శివారు ఇంటిలో ప్రభావతి ఉంటున్నారు. కుమారుడు సీఆర్‌పీఎఫ్‌లో పనిచేస్తున్నాడు. కుమారుడు గత నాలుగు రోజుల నుంచి ఫోన్ చేస్తుండగా సమాధానం లేకపోవడంతో పక్క ఇంటిలో ఉన్న తన పెద్దమ్మకు ఫోన్ చేసి మా అమ్మకు ఫోన్ ఇవ్వాలని కోరా డు. అయితే శుక్రవారం పెద్దమ్మ ఇంటిలోకి వెళ్లి చూడగా ప్రభా వతి శవమై పడి ఉన్నట్లు గుర్తించి సమాచారం ఇచ్చారు. దీంతో విశాఖపట్నంలో ఉన్న మరో కుమారుడికి సమాచారం ఇవ్వగా ఆయన పోలీసులకు ఫిర్యా దు చేశారు. ఎస్ఐ రాజేష్ ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. గత కొంతకాలంగా అనారోగ్యానికి గురై మృతి చెంది ఉండ వచ్చని పలువురు అంటున్నారు. అయితే ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి గొంతు నొక్కి చంపి డబ్బులు, బంగారం తీసుకెళ్లి ఉండవచ్చని మరికొందరు అనుమానం వ్యక్తంచేస్తున్నారు. ఏం జరిగిందో తెలియదు కాని ఇంటి లో మూడురోజుల కిందట చనిపోయినట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్టు

మెళియాపుట్టి: చాపర గ్రామానికి చెందిన పొత్తంగి కృష్ణమూర్తి మద్యం నిల్వలతో పట్టుబడినట్లు టెక్కలి ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జి.రాజశేఖర్ నాయుడు తెలిపారు. ఆయన వద్ద నుంచి 8.6 లీటర్లు ఆంధ్ర మద్యంతో పాటు, 72 లీటర్ల ఒడిశా మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. శుక్రవారం అరెస్టు చేసినట్లు తెలిపారు దాడుల్లో పలాస ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రామచంద్రకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాలు ధ్వంసం

కంచిలి: బొగాబెణి గ్రామంలో శుక్రవారం రాత్రి పిడుగు పడి విద్యుత్ మీటరు, గృహోపకరణాలు ధ్వంసమైనట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామానికి చెందిన కాకినాడ సరస్వతికి చెందిన డాబా ఇంటి ప్రక్కన ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగుపడి ఇంటిలో ఉన్న విద్యుత్ మీటరు, గృహోపకరణాలు కాలిపోయాయన్నారు.

టీడీపీలో చేరిన 200 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరిన సంతబొమ్మాళి వైసీపీ నేతలతో అచ్చెన్నాయుడు

సంతబొమ్మాళి/టెక్కలి/మెళియాపుట్టి: సంతబొమ్మాళి, నందిగాం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. నిమ్మాడలోని క్యాంపు కార్యాలయంలో వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో నరసాపురంకు చెందిన మాజీ సర్పంచ్ ఆల బైరాగి, మాజీ ఎంపీటీసీ దేవాది నర్సింహులు, 5వ వార్డు నెంబరు కళ్లి రాజులు, మాజీ ఉప సర్పంచ్ బడే కుమార స్వామితో పాటు 200 కుటుంబాలు టీడీపీలో చేరారు. అలాగే ఉమిలాడ పంచాయతీ నుంచి గుంటు జానకిరావు, కోడ జగదీష్ తదితరులు, నందిగాం మండలం పెంటూరుకు చెందిన పిన్నింటి రమణయ్యతో 100 కుటుంబాలు, మెళియాపుట్టి నుంచి మాజీ ఎంపీపీ బైరిసింగి లక్ష్మీనారాయణ, సవర శ్రీరాములు, ఎలుగుబంటి దుర్యోధనరావు తదితరులు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి రామచంద్రరావు, వారాధి చంటి పాల్గొన్నారు.

చంద్రబాబును సీఎంగా చేయండి: బగ్గు


టీడీపీ తీర్థం పుచ్చుకున్న పోలాకి వైసీపీ నేతలతో ఉమ్మడి అభ్యర్థి బగ్గు

నరసన్నపేట: రానున్న ఎన్నికల్లో ఉమ్మడి పార్టీ అభ్యర్థులను గెలిపించడం ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబును సీఎంగా చేయాలని నరసన్నపేట అభ్యర్థి బగ్గు రమణ మూర్తి కోరారు. శుక్రవారం పట్టణంలో బండివీధి, తెలగవీధుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గత ఐదేళ్ల లో పట్టణాన్ని వల్లకాడు చేసిన నాయకులను ఇంటికి పంపించే సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బగ్గు సుగుణ, మాజీ సర్పంచ్ గొద్దు చిట్టిబాబు, నేతలు ఉణ్న వెంకటేశ్వరరావు, బోయన ఆనంద్, కింజరాపు రామారావు, బీజేపీ నేతలు పాల్గొన్నారు. ● **పోలాకి:** పోలాకి మండలం చెల్లావలస పంచాయతీకి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు సంపతిరావు రామన్న అనుచరులు, ఉరజాం మాజీ ఎంపీటీసీ సభ్యుడు కిల్లి మోహనరావు, వార్డు సభ్యులు సంపతిరావు వాసుదేవరావు తదితరులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కేఏఎన్ భుక్త, పార్టీ పోలాకి మండల అధ్య క్షుడు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, నేతలు బైరి భాస్కరరావు, తమ్మినేని భూషణరావు, రోణంకి కృష్ణం నాయుడు, లుకలాపు రాంబాబు, జనసేన నాయకులు పాల్గొన్నారు. ● **జలుమూరు (సారవకోట):** కరడసింగి జగన్నాథపురంలో పలువురు నేతలు శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. మాజీ సర్పంచ్ సింగారి మల్లయ్య, గొర్రెబంద తారమ్మతో పాటు 60 కుటుంబాల వారికి బగ్గు రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కరడసింగి జగన్నాధపురం, రామకృష్ణాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రతినిధి ధర్మాన తేజ్‌కుమార్, పార్టీ మండల అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, జనసేన నాయకులు బలగ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి 50 వైసీపీ కుటుంబాలు


టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్ తదితరులతో ఎంపీ అభ్యర్థి కలిశెట్టి

జి.సిగడాం: మద్దివలస వైసీపీ మాజీ సర్పంచ్ మానం సత్యారావు తన అనుచరు లతో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పాటు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మద్దివలస, మానం పేట గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ పలిశెట్టి రమణ ప్రసాద్, పలిశెట్టి అప్పన్న, ఎస్.మహేష్, తదితర 50 కుటుంబాలు వారు పార్టీలో చేరారు. వీరికి విజయనగరం ఎంపీ ఉమ్మడి అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఉమ్మడి అభ్యర్థులను గెలిపించా లని ఆయన కోరారు. కార్యక్రమంలో బాలబొమ్మ వెంకటేశ్వరరావు, పలిశెట్టి సూర్య నారాయణ, కుమరాపు అప్పన్న, కోల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి..


టీడీపీలో చేరిన మందస మండల వైసీపీ నాయకులతో శిరీష

పలాస/వజ్రపుకొత్తూరు/కాశీబుగ్గ: నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీ నేతలు, కార్యకర్తలు శుక్రవారం టీడీపీలో చేరారు. వజ్రపుకొత్తూరు మండలం గరుడభద్ర పంచాయతీ మద్దిపాడు ఉప సర్పంచ్ కొల్లి వరలక్ష్మితో పాటు అనుచరులు, కుటుంబ సభ్యులు, మందస మండలం కుంటికోట మాజీ సర్పంచ్ కొండల తిరుపతిరావుతో పాటు 50 మంది యువకులు, పలాస-కాశీబుగ్గ ఏడో వార్డుకు చెందిన 60 మంది యువకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి గౌతు శిరీష కండువాలు వేసి ఆహ్వానించారు. వజ్రపుకొత్తూరు పెద్దబాడాం గ్రామానికి చెందిన యువకులు ఆ పార్టీ సమన్వ యకర్త యార్లగడ్డ వెంకన్నచౌదరి సమక్షంలో టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన వారిలో పీత శంకర్, దివాకర్, తిరుపతి, డిల్లీ, మోహనరావు ఉన్నారు. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 8వవార్డు నర్సిపురంలో టీడీపీ అభ్యర్థి శిరీష ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నేతలు వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, నాగరాజు పాల్గొన్నారు.

తండ్యాం, దళ్లిపేట నుంచి..


కూలీలతో మాట్లాడుతున్న రవికుమార్

పొందూరు: మండలంలోని తండ్యాం, దళ్లిపేట, పొందూరు గ్రామాలకు చెందిన 70 వైసీపీ కుటుంబాలు శుక్రవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి ఉమ్మడి అభ్యర్థి కూన రవి కుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో తండ్యాంలో 15, దళ్లిపేటలో 20, పొందూరులో 35 కుటుంబాలున్నాయి. మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలు ఆయనను కలిసి సమస్యలను విన్నవించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పి. రామ్మోహన్‌నాయుడు, బీజేపీ ఇన్‌చార్జి పి.సూరపునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు రామ్మో హన్, నేతలు కె.సత్య నారాయణ, ఎ.రాము, బి.శంకరభాస్కర్, ఎ.చినరంగ పాల్గొన్నారు.

చిరంజీవిపై సజ్జల వ్యాఖ్యలు సిగ్గుచేటు

● కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రకాష్


మాట్లాడుతున్న కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ప్రకాష్

అరసవల్లి: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా ప్రముఖ సినీహీరో, మెగాస్టార్ చిరంజీవి పిఠాపురం వస్తుంటే ఆయనపై వైసీపీ నాయకుడు సజ్జల రామకృష్ణారెడ్డి చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని, సజ్జల ఓ సన్నాసి అని కాపు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ ఆలేటి ప్రకాష్ అన్నారు. శుక్రవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం కాపులకు ఆర్థిక, ఉపాధి అవకాశాల్లో తీవ్ర అన్యాయం చేసిందని, కాపు రిజర్వేషన్లను సైతం భ్రష్టు పట్టించిందని విమర్శించారు. వ్యవస్థలను విధ్వంసం చేసిందని, ఉద్యోగ, ఉపాధి కల్పనలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం, చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందడం తథ్యమని, ఎన్డీఏను గెలిపించుకోవాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాస్, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, నేతలు చిట్టి నాగభూషణరావు, పాండ్రంకి శంకర్, పెద్ది కవిత తదితరులు పాల్గొన్నారు.

ఐదు రోజులు మంటలే

● వచ్చే నెలలో మరింత వేడిగాలులు
● 45 డిగ్రీలు దాటి నమోదయ్యే అవకాశం
● వాతావరణ నిపుణుల హెచ్చరిక

విశాఖపట్నం, అమరావతి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది వేసవి తీవ్రంగా ఉంటుందని వాతావరణ నిపుణులు, భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అధికారులు ముందే హెచ్చరించారు. కానీ, అంతకు మించి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గతేడాదికంటే ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని ఐఎండీ సీనియర్ అధికారి డీఎస్ పాయ్ శుక్రవారం పేర్కొన్నారు. ఇప్పటివరకు 2023 అత్యంత వేడి సంవత్సరంగా నమోదైందని, అయితే ఈ ఏడాది ఆ రికార్డును అధిగమిస్తుందని అంచనా వేశారు. రానున్న ఐదు రోజు ల్లో దక్షిణాదిలో ఏపీ, తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక, వీటికి ఆనుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, విదర్భ, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో వేడి వాతావరణం కొనసాగడమే కాకుండా వడగాడ్పులు వీస్తాయని ఐఎండీ శుక్రవారం హెచ్చరించింది. ఈ నెల 28 నుంచి 30 వరకు ఈశాన్య భారతంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రత 46 డిగ్రీలకు చేరనుంది. శనివారం.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, అనకాపల్లి, కాకినాడ, తూర్పుగోదావరి, ఏలూరు జిల్లాల్లోని 64 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు వీస్తాయని, రాష్ట్రవ్యాప్తంగా 183 మండలాల్లో మోస్తరు వడగాడ్పులు వీస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెరిగిన నేపథ్యంలో గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ సూచించారు.

ఉత్తమ డివిజన్‌గా టెక్కలి ఎంపిక

టెక్కలి: ఈ ఏడాది రాష్ట్రస్థాయిలో పశుసంవర్థక శాఖ ఉత్తమ డివిజన్‌గా టెక్కలి ఎంపికైంది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ విజయరాజ్ శుక్రవారం విజయవాడలో టెక్కలి డీడీ డా.జయరాజ్‌కు ప్రశంసాపత్రం అందించి అభినందించారు. పశుగ్రాసాల సాగు, కృత్రిమ గర్భోత్పత్తి ఇంజక్షన్లు, పశు బీమా తదితర విభాగాల్లో టెక్కలి డివిజన్ ముందంజలో ఉండడంతో ఈ ఎంపిక చేశారు. ఉత్తమ డివిజన్‌గా ఎంపికవడంపై ఏడీలు, పశువైద్యులు హర్షం వ్యక్తం చేసి డాక్టర్ జయరాజ్‌ను అభినందించారు.

జాతీయ లోక్‌అదాలత్ జూన్ 29కి వాయిదా

టెక్కలి: మే 11న జరగాల్సిన జాతీయ లోక్‌అదాలత్ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జూన్ 29కి వాయిదా వేసినట్లు సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో రాజీకి అనుకూలమైన క్రిమినల్, సివిల్, ప్రీలిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

వర్సిటీ వెబ్‌సైట్ అప్‌డేట్

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ పరిధిలో విద్యార్థులు, పరిశోధకులు అనుబంధ కళాశాలలకు మెరుగైన సేవలందించేందుకు అప్‌డేట్ చేసిన వెబ్‌సైట్‌ను శుక్రవారం వీసీ కేఆర్ రజిని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పాత వెబ్‌సైట్ కంటే మెరుగైన ఫీచర్స్ జోడించి డిజైన్ చేసినట్లు తెలిపారు.

పరిశోధన రంగాలపై దృష్టి సారించాలి

విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు పరిశోధన, అభివృద్ధి రంగాలపై దృష్టి సారించా లని డా.బీఆర్ అంబేద్కర్ వర్సిటీ వీసీ కేఆర్ రజిని అన్నారు. శుక్రవారం వర్సిటీ సెమినార్ హాల్‌లో ప్రపంచ మేధోసంపత్తి దినోత్సవాన్ని నిర్వహించారు. సృజనాత్మక ఆలోచనలు, నూతన ఆవిష్కరణల కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, రెక్టార్ బి.అడ్డ య్య, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రాజశేఖర్‌రావు పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పుణ్యపువీధిలో వేంచేసి ఉన్న శ్రీ సీతారామచంద్ర మూర్తి సమేత అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి ఉత్సవ విగ్రహాలను పల్లకిపై వేంచేపు చేసి తప్పెటగుళ్లు, కోలాటం, వేషధారణల నడుమ తిరువీధి నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

పలాస టీడీపీ పరిశీలకుడిగా చౌదరి



రణస్థలం: పలాస అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ పరిశీలకుడిగా పార్టీ జిల్లా పూర్వపు అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తిని నియమించారు. ఈ మేరకు రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రీకూర్మనాథుని సేవలో ఎన్నికల పరిశీలకులు

గార: ప్రసిద్ధ శ్రీవైష్ణవ క్షేత్రం శ్రీకూర్మం కూర్మనాథ స్వామిని శుక్రవారం ఎన్నికల పరిశీల కులు నవీన్ కుమార్ సోనీ, కోమల్ జిత్ మీనా (ఐఆర్ఎస్) దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను అర్చకుడు మురళీకృష్ణ వివరించారు. అనంతరం వారిని అర్చకులు ఆశీర్వదించి స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని అందించారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణ ప్రసాద్, వీఆర్వో జగదీష్, నర్సుబాబు, అర్చకుడు కిషోర్‌బాబు పాల్గొన్నారు.

'భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి

పలాస: విద్యార్థి దశ ఎంతో కీలకమని, తప్పటడుగులు వేయకుండా భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక కళాశాలలో తృతీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సభ నిర్వహించారు. మంచి ఆశయాలతో వెళ్లాలని, వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకొని సమాజానికి ఉపయోగపడాలన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, పీడీ మధు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని ఆదరించండి

సరుబుజ్జిలి: రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభానికి కారణమైన వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి సనపల అన్నాజీరావు అన్నారు. శుక్రవారం సుభద్రాపురం, డకరవలస, తమ్మినాయుడుపేట, పెద్దమతలబుపేట, చిన్నమతలబపేట గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పేదల అభ్యున్నతికి నిరంతరం కృషి చేసిన కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లఖినేని నారాయణరావు, సునీల్ కుమార్, బొడ్డేపల్లి గోవింద గోపాల్, బసవ షన్ముఖరావు, బొత్స వెంకటరమణ పాల్గొన్నారు.

ఏపీఎస్ఎస్‌టీఎఫ్ జిల్లా కార్యవర్గం ఏకగ్రీవం

గుజరాతీపేట/సంతబొమ్మాళి: ఆంధ్రప్రదేశ్ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నికల పరిశీలకుడు కరిమి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. జిల్లా ప్రస్తుత అధ్యక్షుడు వైవీ రమణ అధ్యక్షతన జరిగిన సమావేశం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా తూలగాపు కేశవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాడాన రాజు, ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్‌గా ఎం.శ్రీనివాసరావు, జిల్లా గౌరవ సలహాదారులుగా డి.కేశవరావు తోపాటు సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమం లో పలువురు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయండి

● జోనంకి గ్రామస్థుల ఆందోళన


నిరసన తెలుపుతున్న జోనంకి గ్రామస్థులు

జలుమూరు: అనుమతులు లేకుండా గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ సెల్ కంపెనీ టవర్ ఏర్పాటుకు పనులు చేపడుతోందని, వీటిని నిలుపుదల చేయాలని జోనంకి గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పనుల వద్ద నిరసన తెలిపారు. గ్రామంలో 150 కుటుంబాల వారం నివసిస్తున్నామని, నివాసాల నడుమ టవర్ ఏర్పాటు వల్ల అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసి జీవనం సాగిస్తున్న మా ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు స్పందించి టవర్ పనులను నిలుపుదల చేయాలని కోరారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సరోజిని వచ్చి పనులు నిలుపుదల చేయాలని టవర్ నిర్మాణ ప్రతినిధికి ఆదేశించారు.

ఎన్నికల ఖర్చుల రికార్డుల పరిశీలన

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధి నుంచి ఎన్నికల ఖర్చుల వివరాలను వ్యయ పరిశీలకుడు శరవణ కుమార్ రిటర్నింగ్ అధికారి నూరుల్ కమర్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటివరకు నామినేషన్లు, రాజకీయ పార్టీల కార్యక్రమాల్లో ఏ మేరకు ఖర్చుల వివరాలు అందజేశారన్న విషయాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే వీడియో సర్వేలైన్స్ బృందాలు గుర్తించిన వీడియోలు ఒక్కొక్కటిగా పరిశీలించి పలు సూచనలు చేశారు. వివరాలన్నీ పక్కాగా ఉండాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వేలైన్స్ బృందాలు, ఫ్లయింగ్ సర్వేలైన్స్ బృందాలు జీపీఎస్‌లు అమర్చిన వాహనాలపై మరింత నిఘా ఉంచాలన్నారు.

నిరుపేదకు రిక్షా అందించిన ట్రాఫిక్ సీఐ


రామారావుకి రిక్షా అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం క్రైమ్: తనకు అన్నం పెట్టే రిక్షా పాడవడంతో పనిలేక అల్లాడిన ఓ నిరుపేదకు ట్రాఫిక్ సీఐ అవతారం చేయూతనిచ్చారు. వాంబేకాలనీకి చెందిన కె.రామారావు కుటుంబ కలహాల కారణంగా కుటుంబానికి దూరంగా ఉంటూ రిక్షా తొక్కుకుంటూ జీవనం సాగించేవాడు. గతనెల 27న జరిగిన రోడ్డు ప్రమాదంలో రిక్షా పాడైంది. దీంతో ఏడురోడ్ల కూడలి వద్ద ఉన్న బ్రిడ్జిపై దీన స్థితిలో అనారోగ్యంతో ఉన్న రామారావును సీఐ చూసి వివరాలు తెలుసుకున్నారు. వెంటనే ఆసుపత్రిలో చికిత్స అందించారు. అప్పుడు రిక్షా ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు శుక్రవారం సీఐ అవతారం కొత్త రిక్షాను సదరు రామారావుకు అందించారు. సీఐ మాట్లాడుతూ.. ఎస్ఆర్ షాపింగ్ మాల్ సహకారంతో కొత్త రిక్షాను రామారావుకు అందించానన్నారు. ఈ సందర్భంగా సీఐకి రామారావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పరీక్షా కేంద్రం మంజూరు

పొందూరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు పరీక్షా కేంద్రం మంజూరైనట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ ఉదయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ నుంచి ఉత్తర్వులు వచ్చాయన్నారు. యూనివర్సిటీ ఇచ్చిన ఆదేశాల మేరకు పొందూరు లో డిగ్రీ రెండవ, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 29 నుంచి మే 16 వరకు నిర్వహిస్తా మన్నారు. పరీక్షలకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

డిగ్రీ కళాశాలకు బి-గ్రేడ్

ఇచ్ఛాపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బృందం బి-గ్రేడ్ మంజూరు చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రాబిన్ కుమార్ పాడి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 19, 20 తేదీల్లో నాక్ బృందం కళాశాలను సందర్శించి వివిధ అంశాలను పరిశీలించిందన్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలి: అచ్చెన్నాయుడు


టెక్కలి మండలం సీతాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న అచ్చెన్నాయుడు

టెక్కలి: రాష్ట్రంలో సాగుతున్న దగాకోరు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మె ల్యే కింజరాపు అచ్చెన్నా యుడు కోరారు. శుక్రవారం సీతాపురం, తిర్లంగి, తిర్లంగి కాలనీ, రాధావల్లభాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 15 రోజులైనా సీఎం జగన్ స్టిక్కర్ తీసే పరిస్థితి లేదని, ఇక సెప్టిక్ అవ్వడం ఒక్కటే ఉంద న్నారు. నియంత పాలనకు చరమగీతం పాడాలని, ఇవే ఆ పార్టీకి చివరి ఎన్ని కలు కావాలన్నారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బగాది శేషగిరి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి కణితి కిరణ్‌కుమార్, టీడీపీ నేతలు హనుమంతు రామకృష్ణ, మెండ దమయంతి, మట్ట పురుషోత్తం, బొరిగి వెంక ట్రావు, బీజేపీ నాయకులు బూరె నరేంద్ర, గూన మీనాకుమార్ తదితరులు పాల్గొన్నారు. తిర్లంగి గ్రామానికి చెందిన వలంటీర్ తెంబ డిల్లీరాజు పది కుటుంబాలతో టీడీపీలో చేరారు. అలాగే వజ్జ మధు వైసీపీని వీడి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎల్ఎల్ నాయుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావుకు ఎమ్మార్పీఎస్ నాయకుల మద్దతు


గోవిందరావుకు మద్దతు ప్రకటిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

పాతపట్నం: స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి అభ్యర్థి మామిడి గోవింద రావును ఎమ్మార్పీఎస్ నాయకులు శుక్రవారం కలిసి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గోవిందరావు అసెంబ్లీ ఎన్ని కల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ మద్దతు తెలిపామన్నారు. అలాగే పాత పట్నం మండల వైసీపీ మాజీ కన్వీనర్ రేగేటి షణ్ముఖ రావు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. ఈయనకు గోవిందరావు కండువా వేసి ఆహ్వానించారు. కార్య క్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పైల బాబ్జీ, నేతలు ఎల్.తులసివర ప్రసాద్, శివాల చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి: ఎన్ఈఆర్


మహిళలతో మాట్లాడుతున్న ఎన్ఈఆర్

రణస్థలం: ఆడబిడ్డలను అన్ని విధాలా ఆదుకుంటాను.. నా మేనల్లుళ్లకు మంచి భవిష్యత్ ఇస్తాను.. పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పిస్తా.. ఒక్కసారి అవకాశమివ్వండని ఎచ్చెర్ల ఎన్డీఏ కూటమి అభ్యర్థి నడికుదిటి ఈశ్వరరావు అన్నారు. శుక్రవారం వేల్పురాయి గ్రామం చెరువు వద్ద ఉపాధి పనులు చేస్తున్న మహిళలను కలిసి ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు కమలం, ఎంపీగా కలిశెట్టికి సైకిల్ గుర్తుల పై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. గ్రామానికి తాగునీరు, రోడ్డు సదు పాయం కల్పించిన అన్నకు మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు లంక శ్యామల రావు, బాలి శ్రీనివాసరావు, బాడాన జన, పిషిని జగన్నాథంనాయుడు తదితరులు ఉన్నారు.

'సూపర్ సిక్స్'తో అన్ని వర్గాలకు మేలు: గొండు శంకర్


నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ అభ్యర్థి గొండు శంకర్

అరసవల్లి: సూపర్ సిక్స్ పథకాల అమలుతో ప్రజల ఆర్థిక, జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని, అన్ని వర్గాలకు మేలు చేకూరుతుందని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. నగరంలోని వివిధ డివిజన్లలో శుక్ర వారం ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. శ్రీకాకుళం నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దు తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యేగా తనను గెలిపిం చాలని కోరారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, డివిజన్ నాయకులు మైలపల్లి నర్సింహ మూర్తి, మైలపల్లి రాజు, సీహెచ్ మణికంఠ, పీవీ రమణ, జనసేన, బీజేపీ నాయ కులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● రజకులకు టీడీపీ అండగా ఉంటుందని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గ రజక కులస్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. నగరంలో అనువైన చోట్ల దోబీ ఘాట్లను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సతివాడ ధర్మారావు, పట్టణ అధ్యక్షుడు కింతలి రాము, నేతలు వాడాడ రాము, కింతల కొండలరావు, నవరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక విద్యనూ అలవరచుకోవాలి

ఎల్.ఎన్.పేట: గ్రామాల్లోని విద్యార్థులు ప్రాథమిక విద్యతో పాటు ఆధ్యాత్మిక విద్యనూ అరవరచుకోవాలని హిరమండలం సత్యసాయి సేవా సమితి జోనల్ కన్వీనర్ బి.సురేష్ అన్నా రు. శ్యామలాపురం సత్యసాయి భజన మండలిలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచి ఆధ్యాత్మికత అలవరచుకోవాలన్నారు. ఇటీవల నిర్వహించిన పోటీ పరీక్షల్లో విజేతలైన బాలవికాస్ చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందించారు. కార్యక్రమంలో భజన మండల కన్వీనర్ ఎ.నారాయణరావు, యూత్ కో-ఆర్డినేటర్ టి.దుర్గారావు, శైలజ, సింహాచలం, డిల్లీరావు పాల్గొన్నారు.